### నాడు నీళ్లకు గోసయ్యేది

అప్పట్లో కాలువల్లో నీళ్లు సరిగా రాక పంట వేసుకునేందుకు గోసయ్యేది. వారబందీలో నీళ్లివ్వడంతో పంటలు దెబ్బతినేవి. కొంచెం నీళ్లు ఎక్కువగా వదిలిపెడితే కట్ట తెగిపోయేది. దీంతో రోజుల కొద్దీ నీళ్లురాక పంటలు ఎండిపోయేవి. తెలంగాణ రాకముందు సాగు నీళ్ల కోసం రూ.3లక్షలు పెట్టి బావి లోతు తవ్విస్తే అప్పులైనయ్.. ఇప్పుడు సాగు నీళ్లకు రంది లేదు. పుష్కలంగా నీళ్లు వస్తుండడంతో పంటలు మంచిగ పండుతున్నయ్.

*- గూడూరి ప్రభాకర్‌రెడ్డి, రైతు (రంగాపూర్)*



పంట పొలంలో రైతు ప్రభాకర్‌రెడ్డి

# నిండుగా 'కాకతీయ'..

- స్వరాష్ట్రంలో కాలువలకు మహర్దశ
- చివరి ఆయకట్టుకూ పుష్కలంగా నీళ్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



నీటి ప్రవాహంతో కళ కళ లాడుతున్న కాకతీయ కాలువ (ఫైల్)

ప్రత్యేక రాష్ట్రంలో కాకతీయ కాలువకు మహర్దశ వచ్చింది. నాడు సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుకున్న కాలువ నేడు నిండుగా పారుతూ పంటలకు జీవం పోస్తున్నది. శ్రీరాంసాగర్ పునర్జీవ పథకంలో భాగంగా శిథిలావస్థలో ఉన్న కాకతీయ కాలువలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పటిష్టపరచడంతో తమకు ఎంతో మేలు జరుగుతున్నదని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నది.

*-హుజూరాబాద్, నవంబర్ 11*

నాలుగేండ్ల క్రితం కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు, యూటీలకు మరమ్మతులు చేపట్టారు. కట్టను విస్తరించడంతోపాటు, ఎత్తు పెంచడం, లైనింగ్ పనులు చేశారు. దీంతో 7500 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేసినా ఎక్కడా కూడా తెగిపోకుండా కాలువ నిండుగా ప్రవహిస్తున్నది. కాలువ ఎత్తును ఇరువైపులా సగం మీటరు ఎత్తు పెంచగా, కుడి కట్ట గతంలో 7మీటర్లు ఉండగా, ప్రస్తుతం 8.5మీటర్లకు పెంచారు. అదే విధంగా ఎడమ కట్ట 5మీటర్లు ఉండగా, 7మీటర్ల వరకు పెంచారు. అయితే అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో నీళ్లు విడుదల చేయడం సాధ్యం కాకపోయేది. పూర్తి స్థాయిలో ఆయకట్టు స్థిరీకరించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేయగా.. మరమ్మతులు చేపట్టినప్పటి నుంచి చివరి ఆయకట్టు వరకు సాగు నీళ్లు సాఫీగా వెళ్తుండడంతో రైతులు సంతోషంలో ఉన్నారు.

### ఇప్పుడు నీటికి ఢోకాలేదు



ఎప్పుడో దశాబ్దాల కాలం తవ్విన కాకతీయ కాలువలు దెబ్బతిన్నా సీమాంధ్ర పాలకులు పట్టించుకోలేదు. నాడు అంతంతగానే నీళ్లు రావడంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండేది. బీఆర్‌ఎస్ సర్కారు కాలువలు మరమ్మతు చేయించిన నాటి నుంచి నీటికి ఢోకాలేదు. కేవలం ఒక్క హుజూరాబాద్ మండల పరిధిలోని కాలువలను పటిష్టపరిచేందుకు సర్కారు రూ.25కోట్లు వెచ్చించడం హర్షణీయం.

*-ఎడవెల్లి కొండల్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్(సిర్సపల్లి)*



బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన లైనింగ్ పనులు (ఫైల్)

## మూడు గంటల కరంట్ కావాలా..

# 24 గంటల కరంట్ కావాలా?

- ఈటలకు డిపాజిట్ గల్లంతే.. • ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 11: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వ్యవసాయానికి మూడు గంటల కరంటే ఇస్తారాట.. కేసీఆర్ ప్రభుత్వం వస్తే 24 గంటల ఉచిత కరంట్ వస్తుందని విప్, బీఆర్‌ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సిర్సపల్లి, వెంకట్రావుపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాలతోపాటు పట్టణంలోని 1, 12, 13, 15 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబంధు, రైతు బీమా, ధాన్యం కొనుగోళ్లు, 24గంటల ఉచిత కరంట్ ఇచ్చే కేసీఆర్ సారే మరోసారి సీఎం అవుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వాల కాలంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, రాత్రిపూట పొలాల వద్దే ఉండేవారని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎరువులు, విత్తనాల కొరతతో రైతులు ఎంత ఇబ్బంది పడ్డారో ఆలోచించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పింఛన్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉప ఎన్నికలో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఇప్పటివరకు ఏ గ్రామాన్ని సందర్శించలేదన్నారు. ఎన్నికలు రాగానే నామినేషన్ వేసి హెలిక్యాప్టర్ ఎక్కి వెళ్లిపోయాడని అన్నారు. ఈనెల 30న జరుగబోయే ఎన్నికల్లో ఈటల రాజేందర్‌కు డిపాజిట్ కూడా రాదన్నారు. ఎవరు ఎన్ని మాయమాటలు చెప్పినా వినకుండా బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను ఆశీర్వదించాలని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చాడు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గందె రాధిక, కొలిపాక నిర్మల, సర్పంచ్‌లు సువర్ణాల సునయన, తిరుమల, ఎంపీటీసీలు రాధమ్మ, శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ కొండాల్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఉన్నారు.

హుజూరాబాద్ రూరల్: సిర్సపల్లిలో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి, హాజరైన గ్రామస్తులు





# వాడవాడలా విస్తృత ప్రచారం

ప్రజలకు బీఆర్‌ఎస్ పథకాలు వివరించి ఓటు అభ్యర్థించిన గులాబీ శ్రేణులు



27వ వార్డులో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 11: హుజూరాబాద్ 27వ వార్డులోని కోతిబొమ్మ ఏరియాలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శనివారం వాడవాడలా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులు, తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకువెళ్లారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేయాలని, కౌశిక్‌రెడ్డిని గెలిపించి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని కోరారు. కారు గుర్తుకు ఓటేస్తే పట్టణాన్ని గొప్పగా తీర్చిదిద్దుకుందామని స్థానిక కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు మూశం మార్కండేయ, 3వ వార్డు కౌన్సిలర్ మక్కపెల్లి కుమార్‌యాదవ్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఇసాక్, నాయకులు జీ అనిల్‌కుమార్, చక్రపాణి, టీ తిరుపతి, లింగయ్య తదితర నాయకులు వార్డులోని పార్టీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## కౌశిక్‌రెడ్డి గెలుపు కోసం కాళేశ్వరంలో పూజలు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్11: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలువాలని కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో శనివారం ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు, నిరుపేదల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెచ్చిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు కూడా రావన్నారు. ముక్కంటి దయతో కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మకుండా ప్రజా రంజక పాలన చేస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని సమ్మయ్య కోరారు.



కాళేశ్వరం ఆలయంలో బీఆర్‌ఎస్ కరపత్రంతో సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్

## బీజే నియోజకవర్గ కన్వీనర్‌గా సంతోష్‌కుమార్



సంతోష్‌కుమార్‌యాదవ్‌కు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్11: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని దమ్మక్కపేట గ్రామానికి చెందిన కూకట్ల సంతోష్‌కుమార్ యాదవ్‌ను భారత్ జాగృతి హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తూ తెలంగాణ చరిత్ర, విద్యార్థి, యువత, మహిళా సాధికార అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో భారత్ జాగృతిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు నవీన్‌ఆచారి, రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంతరావు, పీఆర్‌వో గాలిపెల్లి రత్నాకర్, యూత్ జిల్లా అధ్యక్షుడు ఉయ్యాల విష్ణువర్ధన్‌కు సంతోష్‌కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.